# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి : 18 సంచిక : 324 సోమవారం, జులై 21, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam


## హోంగార్డు వద్ద గంజాయి ప్యాకెట్లు

### - షాకైన పోలీసులు



**సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లాలో ఓ హోంగార్డు నుంచే గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిల్లా కోర్టులో ఓ ఉన్నతాధికారి వద్ద విధుల్లో ఉన్న కొమ్ముల రాజు అనే హోంగార్డు, శనివారం రాత్రి కంది ప్రాంతంలో గంజాయి ప్యాకెట్లతో బైక్ వద్ద నిలబడి

2లో..

## పార్లమెంట్ సమావేశాల వేళ

# ఒక్కటైన అధికార, విపక్షాలు


**- జస్టిస్ యశ్వంత్ వర్మపై మహాభియోగ తీర్మానం**

**- అధికార పార్టీకి మద్దతు ఇచ్చిన విపక్ష కాంగ్రెస్ - పహల్గామ్ దాడి, మణిపూర్ హింసపై విపక్షాల పట్టు**



**న్యూఢిల్లీ :** నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ యశ్వంత్ వర్మ మహాభియోగ తీర్మానం, ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలు కీలకం కానున్నాయి. జస్టిస్ వర్మ తొలగింపునకు మహాభియోగం తీర్మానం తీసుకురానున్నట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఇప్పటికే 100కిపైగా ఎంపీలు తమ మద్దతును తెలియజేస్తూ సంతకాలు చేసినట్టు సమాచారం. మార్చి 14న హోలీ రోజున ఢిల్లీలోని జస్టిస్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం

2లో..



## రష్యాలో భారీ భూకంపం

**రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు**

**మాస్కో :** రష్యాలో మూడు భూకంపాలు సంభవించాయి. నిమిషాల వ్యవధిలో భూమి ప్రకోపించింది. ఆ దేశాన్ని వణికించింది. ఈ మూడు కూడా అత్యంత శక్తిమంతమైనవే. తీర ప్రాంతం కావడం, భూకంపాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సునామీ హెచ్చరికలను జారీ చేశారు. ముందు జాగ్రత్త చర్యగా తీర ప్రాంతాలన్నింటినీ కూడా ఖాళీ చేయించారు. రష్యాలోని కమ్ చట్కా ప్రావిన్స్ రాజధాని పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీ సమీపంలో భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:23 నిమిషాలకుఈ మూడు భూకంపాలు సంభవించాయి. వీటిలో ఒక భూకంపం తీవ్రత 7.4గా నమోదైందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ నేపథ్యంలో సునామీ హెచ్చరిక జారీ చేశారు. 32 నిమిషాల వ్యవధిలో భూమి మూడుసార్లు కంపించింది. మొదటి భూకంపం 5.0 తీవ్రతతో

2లో..

## తెలంగాణ రాజకీయాల్లో

# అంతర్గత కుమ్ములాటలు

**బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో కలవరం**

**హైదరాబాద్** తెలంగాణలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో అసమ్మతి రాగాలు సెగలు రేపుతున్నాయి. ఈ మూడు పార్టీల్లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు అంతర్గతంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. బీఆర్ఎస్ లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ కార్యక్రమాలతో బీఆర్ఎస్ లో కాక పుట్టిస్తుండగా, బీజేపీలో ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ వాడివేడి వ్యాఖ్యలు కమలం పార్టీని కుదిపేస్తున్నాయి. ఇక అధికార కాంగ్రెస్ లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన కామెంట్స్ హస్తం పార్టీలో దుమారాన్నే లేపుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ అంతర్గత సమస్యలను పరిష్కరించకపోతే ఈ మూడు పార్టీలకు ఇబ్బందులు తప్పవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన

2లో..

## తెలంగాణ యువతకు

# రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శం

**- కోటి నజరానా ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ :** భారతీయ సినిమా గురించి ఆ మాటకు వస్తే మన తెలుగు సినిమా గురించి ప్రపంచమంతా మాట్లాడుకునేలా చేసిన పాట 'ఆర్ఆర్ఆర్: రౌద్రం రణం రుధిరం' సినిమాలోని 'నాటు నాటు'. ఆస్కార్ సాధించిన తొలి తెలుగు పాటగా, భారతీయ పాటగా రికార్డ్ సృష్టించింది. 'నాటు నాటు' పాడిన గాయకులలో ఒకరైన తెలంగాణ యువకుడు రాహుల్ సిప్లిగంజ్ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ యువతకు రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శం అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసచారు.

2లో..




## గోషామహల్ బై పోల్‌పై

# తేల్చేసిన రాజాసింగ్

**- ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకోలేదన్న ఎమ్మెల్యే**

**- బీజేపీ హైకమాండ్ చెబితే ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తా**

**హైదరాబాద్** బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్ అడుగులు ఎటు. రాజాసింగ్ రాజీనామాను బీజేపీ ఆమోదిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో, బీజేపీ సింబల్ పైన ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ పై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ కు లేఖ రాసేందుకు పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, ఇదే సమయంలో రాజాసింగ్ శివసేనలో చేరుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వీటి పైన రాజాసింగ్ స్పష్టత ఇచ్చారు. కొత్తగా చేరే పార్టీతో పాటుగా గోషామహల్ కు ఉప ఎన్నిక అంశం పైన రాజాసింగ్ తేల్చి చెప్పారు. బీజేపీ నుంచి బయటకు వచ్చిన రాజాసింగ్ రాజకీయ భవిష్యత్ ఏంటి. గోషామహల్ బాధ్యతలను రాజాసింగ్ స్థానంలో మాధవీలత కు ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ సమయంలో రాజాసింగ్ స్పష్టత ఇచ్చారు. తాను ఏ పార్టీలో చేరే అంశం పైన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తన ఎమ్మెల్యే పదవి పైన బీజేపీ నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమని బీజేపీ సూచిస్తే, తాను సిద్దంగా ఉన్నానని స్పష్టం చేసారు. తాను చివరి శ్వాస వరకు హిందూత్వం కోసం పోరాటం

2లో..



## ఎంపీ మిథున్ రెడ్డికి రిమాండ్

**- లిక్కర్ కేసులో రిమాండ్ విధించిన కోర్టు**




**విజయవాడ** ఏపీ మద్యం కుంభకోణం కేసులో వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసులో ఏ4గా ఉన్న మిథున్ రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో పోలీసులు ఎంపీ మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్నారు. లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు హాజరైన మిథున్ రెడ్డిని దాదాపు ఏడు గంటలపాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం శనివారం సాయంత్రం సిట్ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారని తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం విజయవాడ ఏసీబీ కోర్టులో మిథున్ రెడ్డిని హాజరుపరిచారు.

2లో..

## భారత్ మరో కీలక ఘనత

**- మలేరియా నివారణకు స్వదేశీ వ్యాక్సిన్**

భారత్ మలేరియా నిర్మూలన దిశగా కీలక ముందడుగు వేసింది. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), భువనేశ్వర్‌లోని రీజనల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ (ఆర్ఎంఆర్సీబీబీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ (ఎన్ఐఎంఆర్) మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ (డీబీటీ-ఎన్ఐఐ) సంయుక్తంగా 'అడ్‌ఫాల్సివాక్స్' అనే స్వదేశీ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ వ్యాక్సిన్ ను మలేరియాకు కారణమయ్యే అత్యంత ప్రమాదకరమైన ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ పరాన్నజీవి యొక్క రెండు కీలక దశలను లక్ష్యంగా చేసుకుని రూపొందించారు. ప్రీ-క్లినికల్ పరీక్షల్లో ఈ వ్యాక్సిన్ అద్భుతమైన ఫలితాలను చూపింది. ఇది ప్లాస్మోడియం ఒకే దశను లక్ష్యంగా చేసుకునే సాంప్రదాయ వ్యాక్సిన్‌లతో పోలిస్తే విస్తృత రక్షణను అందిస్తుందని, రోగనిరోధక వ్యవస్థ నుంచి మలేరియా పరాన్నజీవి తప్పించుకునే అవకాశం తక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీర్ఘకాల రోగనిరోధక శక్తిని అందిస్తుందని, ఈ వ్యాక్సిన్




సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద 9 నెలలకు పైగా స్థిరంగా ఉంటుందని పరీక్షలు సూచిస్తున్నాయి. ఈ వ్యాక్సిన్‌ను లాక్టోకాకస్ లాక్టిస్ బ్యాక్టీరియా ఉపయోగించి తయారు చేశారు, ఇది వ్యక్తులను రక్షించడమే కాకుండా మలేరియా వ్యాప్తిని కూడా తగ్గిస్తుంది. ఐసీఎంఆర్

2లో..

## తెలంగాణలో భారీ వర్షాలు


**- 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**



**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రానికి భారత వాతావరణ కేంద్రం భారీ వర్ష సూచన విడుదల చేసింది. నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ శాఖ డైరెక్టర్ డా. కె. నాగరత్నం హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది. ఇది ఆయా ప్రాంతాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తుంది. ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, మెదక్, కామారెడ్డి,

2లో..

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. సీఎం రేవంత్‌రెడ్డిపై
# పోలీసులకు బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు



బంజారాహిల్స్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబసభ్యుల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ బీఆర్ఎస్ నాయకురాలు సుమిత్రా అనంద్‌తో పాటు పలువురు కార్యకర్తలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 18న నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో జరిగిన బహిరంగసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేకపోతున్నారని అన్నారు. బావిలో దూకి చావు.. పెట్రోల్ పోసుకుని చావు.. మీ కుటుంబసభ్యులు కూడా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోండి.. అంటూ అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.రాజ్యాంగబద్ధమైన సీఎం పదవిలో ఉంటూ ప్రతిపక్ష నేతను ఆత్మహత్య చేసుకోవాలంటూ వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి మీద వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు పోలీసులు ఫిర్యాదు స్వీకరించి న్యాయసలహా అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా తమ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వకపోవడంపై సుమిత్రా అనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన కార్యకర్తలపై ఎలాంటి ఆధారాలు లేకున్నా కేసులు పెట్టే పోలీసులు సీఎం రేవంత్‌రెడ్డి మీద ఫిర్యాదు చేస్తే కేసు ఎందుకు పెట్టరంటూ ప్రశ్నించారు.

# యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు

### - వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్



మాగనూరు : రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలకుండా చూసుకోవాలని నారాయణపేట్ జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. ఆదివారం మాగనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతు ఆగ్రో సేవ కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా, ప్రస్తుత అవసరాలకు మేర రైతులు యూరియా కొనుగోళ్లు చేయాలన్నారు. చాలా మంది రైతులు ముందస్తుగానే రెండవ, మూడవ దఫా ఎరువులు కొని దాచుకుంటున్నారు. అలా కాకుండా ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడే కొనుగోలు చేయాలని కోరారు. మార్కెట్ నుండి ఎప్పటికప్పుడు యూరియా సరఫరా చేస్తాం అని తెలిపారు. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకారం కేంద్రంలో 1500 బస్తాలు, రైతు ఆగ్రో సేవా కేంద్రంలో 500 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, ప్రతిరోజు కూడా వస్తూ ఉంటుందని, రైతులు అధైర్య పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగనూరు మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్. పిఏసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి రైతు అగ్రో సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై పలు వాహనాలు ఢీ..
### బాలుడితో సహా ముగ్గురు మృతి, పలువురికి గాయాలు



చెన్నై: జాతీయ రహదారిపై పలు వాహనాలు ఢీకొన్నాయి. ఏడేళ్ల బాలుడితో సహా ముగ్గురు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వాహనాల్లో చిక్కుకున్న వారిని రెస్క్యూ సిబ్బంది కాపాడారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వాహనాలు రద్దీగా ఉండే బెంగళూరు-సేలం హైవేపై ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. తొలుత ఒక లారీ ప్రమాదానికి గురైంది. దాని వెనుక ఉన్న రెండు కార్లు, బైక్‌ను మరో లారీ ఢీకొట్టింది. దీంతో ఆ కార్లు, బైక్ నుజ్జునుజ్జు అయ్యాయి.కాగా, ప్రమాదానికి గురైన కార్లలో ఉన్న ఏడేళ్ల బాలుడితోసహా ముగ్గురు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో రెండు లారీలు, రెండు కార్లు, బైక్ ధ్వంసమైనట్లు పోలీస్ అధికారి తెలిపారు. వాహనాలు నిలిచిపోయాయని, దీంతో కొంత శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసినట్లు వెల్లడించారు.

# ఆపరేషన్ సిందూర్‌లో ఆర్మీకి సహకరించిన బాలుడు..

### అతడి చదువుకు సహకారం



చండీగఢ్: ఆపరేషన్ సిందూర్ సమయంలో పదేళ్ల బాలుడు ఆర్మీకి సహకరించాడు. పాకిస్థాన్ సైనికుల కాల్పులకు ధీటుగా సమాధానం ఇచ్చిన ఆర్మీ జవాన్లకు ఆహారం, తాగు నీరు వంటివి అందించాడు. (Army To Sponsor Brave Boys Education) ఆ బాలుడి ధైర్యసాహసాలను ఆర్మీ ప్రశంసించింది. అతడి చదువుకు సహకరించేందుకు ముందుకు వచ్చింది. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు.

## తెలంగాణ యువతకు
# రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శం

సొంత కృషితో అతను పైకి ఎదిగాడని పేర్కొన్నారు. ఆస్కార్ సాధించిన పాట వెనుక రాహుల్ కృషి ఉందని తెలిపారు. యువత అతడిని మార్గదర్శిగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. అంతే కాదు అతడికి కోటి రూపాయల నజరానా కూడా ప్రకటించారు. గద్దర్ అవార్డులో ప్రకటించిన సమయంలోనూ రాహుల్ సిప్లిగంజ్ గురించి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. అతడికి పురస్కారం ఏమీ రాలేదని, భవిష్యత్తులో ఏదైనా చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం చిత్రసీమకు ఎటువంటి అవార్డులు ఇవ్వలేదు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గద్దర్ అవార్డులు ప్రకటించారు. గతేడాది విడుదలైన అన్ని సినిమాలలో అన్ని విభాగాలకూ అవార్డులు ఇచ్చారు. పదేళ్ల కాలంలో ప్రతి ఏడాది విడుదలైన సినిమాల్లో కేవలం సినిమా విభాగంలో అవార్డులు ఇచ్చారు తప్ప మిగతా విభాగాలలో ఎటువంటి ఆ పురస్కారాలు ఇవ్వలేదు. అందువల్ల ఇప్పుడు రాహుల్ సిప్లిగంజ్ పంట పండింది.'నాటు నాటు' పాటకు ఆస్కార్ వచ్చి రెండేళ్లు దాటింది. ఇప్పుడు పాట పాడిన గాయకుడికి తెలంగాణ ప్రభుత్వం నజరానా ప్రకటించడం విశేషం. ఆస్కారం వచ్చిన సమయంలో తెలంగాణలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు నేతృత్వంలోనే భారతీయ రాష్ట్ర సమితి పార్టీ అధికారంలో ఉంది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అతడికి నజరానా ప్రకటించారు. 'ఆర్ఆర్ఆర్: రౌద్రం రణం రుధిరం' సినిమాకు సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి తనయుడు, యువ స్వరకర్త కాలభైరవ కూడా రాహుల్ సిప్లిగంజ్‌తో కలిసి ఆ పాట పాడారు.

# గోషామహల్ బై పోల్‌పై తేల్చేసిన రాజాసింగ్

చేస్తానని తేల్చి చెప్పారు. బీజేపీ అధినాయకత్వం పైన తనకు ఎలాంటి వ్యతిరేక భావం లేదని చెప్పుకొచ్చారు. ఇక, సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో రాజాసింగ్ అమ్మవారిని దర్శించు కొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ బోనాల శుభాకాంక్ష లు తెలిపారు.వేలాదిమంది సింహవాహిని అమ్మవారి దర్శనం కోసం వస్తున్నారని చెప్పుకొచ్చారు. యావత్ భారతదేశంలో ఉండే హిందువుల అందరిపై సింహవాహిని అమ్మవారి ఆశీస్సులు ఉండా లని కోరుకున్నానని అన్నారు. దర్శనం అనంతరం ఓ మంత్రి తనతో మాట్లాడారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా అందరి లక్ష్యం ఒకటేనని, మోడల్ గోశాల కట్టడానికి తన సహకారం కావాలని ఆ మంత్రి తనను కోరారని చెప్పుకొచ్చారు. సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని వైభవం గా కడతామని గత ప్రభుత్వాలు గుడిపై రాజకీయం చేశారని విమర్శించారు ఎమ్మెల్యే రాజాసింగ్.

# తెలంగాణలో భారీ వర్షాలు

జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, హన్మకొండ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతాయని తెలిపింది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నెల 24 వరకు రాష్ట్రంలో పలు చోట్ల అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారడం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల ఈ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం (జులై 21) పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. మంగళవారం (జులై 22) ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల నివాసితులు, నదులు, ప్రాజెక్టుల తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప బయట ప్రయాణాలు మానుకోవాలి. విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలి. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలి, రోడ్లపై నీరు నిలిచి ఉన్న ప్రదేశాలలో నెమ్మదిగా వెళ్ళాలి.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలకు సహకరించాలి. వాతావరణ శాఖ విడుదల చేసే సూచనలను నిరంతరం గమనించాలి. పిల్లలు, పెంపుడు జంతువుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు.

# భారత్ మరో కీలక ఘనత

ఈ వ్యాక్సిన్ టెక్నాలజీని పరిశ్రమలకు, తయారీదారులకు నాన్-ఎక్స్‌క్లూజివ్ ఒప్పందాల ద్వారా లైసెన్స్ చేయాలని యోచిస్తోంది. దీని ద్వారా విస్తృత ప్రజారోగ్య ప్రయోజనాలను సాధించడం లక్ష్యంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా' ఉద్దేశాన్ని నెరవేర్చే ఈ స్వదేశీ వ్యాక్సిన్, మలేరియా నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ పరిశోధన, అభివృద్ధి దశలో ఉంది మరియు ఇంకా వాణిజ్య లేదా క్లినికల్ ఉపయోగం కోసం అందుబాటులో లేదు.

# ఎంపీ మిథున్ రెడ్డికి రిమాండ్

అంతకు ముందు సిట్ ఆఫీసు నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఎంపీ మిథున్ రెడ్డిని తీసుకెళ్లారు. బీపీ, షుగర్, ఈసీజీ వంటి సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని డాక్టర్లు నిర్ధారించడంతో సిట్ అధికారులు మిథున్ రెడ్డిని విజయవాడలోని ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట హాజరు పరిచారు. మిథున్ రెడ్డిపై సెక్షన్ 409, 420, 120(బీ), రెడ్ విత్ 34, 37, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ సెక్షన్లు 35 7, 72, 8, 13(1)(2), 13(2) కింద కేసు నమోదు చేసినట్లు సిట్ కోర్టుకు నివేదించింది. సిట్ తరపున కోటేశ్వరరావు, ఎంపీ మిథున్ రెడ్డి తరపున నాగార్జున రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ఏసీబీ కోర్టు ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది. ఎంపీ మిథున్ రెడ్డిని పోలీస్ కస్టడీకి తీసుకోవాల్సి ఉందని ఆయనను గుంటూరు సబ్ జైలుకు తరలించాలని సిట్ లాయర్ కోరారు. వై కేటగిరి సెక్యూరిటీ ఉన్న నేత, ఎంపీ మిథున్ రెడ్డి అని ఆయనకు రిమాండ్ విధిస్తే నెల్లూరు జైలులో ప్రత్యేక బ్యారక్ ఇవ్వాలని ఎంపీ తరపు లాయర్ కోరారు. ప్యానెల్ స్పీకర్ గా పనిచేసిన మిథున్ రెడ్డి అరెస్టుపై స్పీకర్ కు సమాచారం ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు.

## నీ బిడ్డలం..బోనమందుకో తల్లి..
### కొత్తగూడెంలో వైభవంగా బోనాల పండుగ



రామవరం: ఆషాడ మాసం ఆఖరి ఆదివారం పురస్కరించుకొని సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని కార్మిక ప్రాంతాలలో పండుగ వాతావరణం కనిపించింది. ఎక్కడ చూసినా గ్రామ దేవత అయిన వేల్పులమ్మ తల్లి బోనాల జాతర ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో నిర్వహించే ఈ బోనాలలో ప్రజల సుభిక్షంగా ఉండాలని ఉద్దేశంతో నీ బిడ్డలం బోనమెత్తినము మమ్ము సల్లంగా చూడు తల్లి అంటూ మొక్కలు చెల్లించుకున్నారు. ఆషాడ మాసం అంటేనే వర్షాకాలం.. అంటువ్యాధులకు ఆలవాలమైన మాసం. కలరా, ప్లేగు, మశూచి, క్షయ, తట్టు, పొంగు, అమ్మవారు వంటి అంటువ్యాధుల బారిన పడకుండా గ్రామదేవతలు గ్రామాలను చల్లంగా చూసేందుకే అనాదిగా బోనాలు సమర్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎంతో నియమనిష్ఠలతో అమ్మవారికి పరమాన్నం వండి, బెల్లం శాకం తో బోనాన్ని తయారుచేసి ఇంటి నుండి డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి చేరి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత అమ్మవారికి సమర్పించగా మిగిలిన పదార్థాలను ప్రసాదాలుగా స్వీకరించి అందరికీ పంపిణీ చేశారు.

# హోంగార్డు వద్ద గంజాయి ప్యాకెట్లు

ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటన శాంతిభద్రతల పరిరక్షణలో ఉండాల్సిన వారిలోనూ కొందరు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే విషయాన్ని స్పష్టం చేసింది. పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకొని కొమ్ముల రాజు నుంచి 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.80,000 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. సాధారణంగా అక్రమ కార్యకలాపాలను అరికట్టాల్సిన హోంగార్డు ఇలా గంజాయి వ్యాపారంలో పట్టుబడటం పోలీసు శాఖలో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో కొమ్ముల రాజు ఈ గంజాయిని ఎక్కడి నుంచి తెచ్చాడు. ఎవరికి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నాడు.? ఈ అక్రమ రవాణాలో ఇంకెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సంఘటిత నేరాల ముఠాలతో అతనికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది. ఈ తరహా ఘటనలు పోలీసు వ్యవస్థ పారదర్శకత, జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఇలాంటి ఘటనలు సాధారణ ప్రజల్లో పోలీసులపై ఉన్న నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తాయి. సంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసిన ఈ ఘటన, తెలంగాణ రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఎంతవరకు విస్తరించిందో మరోసారి చాటి చెప్పింది. విద్యాసంస్థల పరిసరాల్లో, యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాపారం జరుగుతున్న అనేక కేసులు గతంలోనూ నమోదయ్యాయి. ప్రభుత్వం గంజాయి సాగు రవాణాను అరికట్టడానికి ఆపరేషన్ పరివర్తన్ వంటి కార్యక్రమాలను చేపట్టినప్పటికీ, ఇలాంటి సంఘటనలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం, పోలీసు శాఖ ఈ ఘటనను సీరియస్‌గా తీసుకొని హోంగార్డు రాజు వెనుక ఉన్న ముఠాలను గుర్తించి కఠినంగా శిక్షించాలి. అంతేకాకుండా పోలీసు, హోంగార్డు సిబ్బందిలో ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టి, నిరంతర తనిఖీలు, పటిష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. యువతను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించడానికి అవగాహన కార్యక్రమాలు, డ్రగ్స్ వ్యసనానికి గురైన వారికి పునరావాస కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలు మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

# రష్యాలో భారీ భూకంపం

సంభవించింది. దీని తర్వాత 6.7 తీవ్రతతో భూమి ప్రకోపించింది. పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీకి తూర్పు దిశగా 151 కిలోమీటర్ల దూరంలో గల ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తించారు. ఉపరితలం నుంచి 8.7 కిలోమీటర్ల లోతులో ఫలకాల్లో చోటు చేసుకున్న పెను కదలికల వల్ల భూమి కంపించినట్లు యూఎస్జీఎస్ తెలిపింది. ఆ వెంటనే రిక్టర్ స్కేల్ పై 7.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఇది పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీకి తూర్పున 144 కిలోమీటర్ల దూరంలో చోటు చేసుకుంది. ఉపరితలం నుంచి 20 కిలోమీటర్ల లోతు భూమి కంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ మూడు భారీ భూకంపాల వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదని సమాచారం అందింది. వీటి తీవ్రత నేపథ్యంలో పసిఫిక్ మహాసముద్రంలో భూకంప కేంద్రం నుండి 300 కిలోమీటర్ల పరిధిలో గల ప్రాంతాన్ని అత్యంత ప్రమాదకరంగా గుర్తించారు. ప్రమాదకరమైన సునామీ సంభవించే అవకాశం ఉందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే హెచ్చరించింది. పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీ రీజియన్ లో 1,60,000 కంటే ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారు.పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీ రష్యా సరిహద్దుల్లో ఉంటుంది. జపాన్‌కు ఈశాన్యం, అలాస్కాకు పశ్చిమం దిశగా ఉంటుందీ తీర ప్రాంతం. పసిఫిక్ మహా సముద్ర తీర ఉందిక్కడ. కమ్ చట్ స్కీ ఓ ద్వీపకల్పం. పసిఫిక్, నార్త్ అమెరికా టెక్టోనిక్ ప్లేట్‌ల పరిధిలో ఉండటం వల్ల తరచూ భూకంపాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది. 1900 సంవత్సరం నుండి ఈ ప్రాంతంలో 8.3 లేదా అంతకంటే ఎక్కువ తీవ్రత కలిగిన ఏడు ప్రధాన భూకంపాలు సంభవించాయి. భూకంపాలకు హాట్ జోన్ గా పరిగణిస్తుంటారీ ప్రాంతాన్ని. అసాధారణ తీవ్రతతో భూకంపాలు సంభవిస్తోండటమే దీనికి ప్రధాన కారణం.

## పార్లమెంట్ సమావేశాల వేళ
# ఒక్కటైన అధికార, విపక్షాలు

జరిగిన సమయంలో భారీగా నోట్ల కట్టు బయటపడటం కలకలం రేపింది. న్యాయవ్యవస్థ అవినీతిలో కూరుకుపోయినట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో సుప్రీం కోర్టు తానే స్వయంగా విచారణకు ఆదేశించగా, ముగ్గురు సభ్యుల కమిటీ ఆయనపై మహాభియోగానికి సిఫార్సు చేసింది. అయితే జస్టిస్ వర్మ దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.భారత రాజ్యాంగం ప్రకారం, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తిని తొలగించడం అనేది రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మాత్రమే సాధ్యం. ఇది కూడా మహాభియోగ తీర్మానం ఆధారంగా మాత్రమే జరగాలి. లోక్‌సభలో కనీసం 100 మంది లేదా రాజ్యసభలో 50 మంది సభ్యుల మద్దతుతో మహాభయోగ తీర్మానం ప్రవేశపెట్టాలి. ఆ తర్వాత మెజార్టీ సభ్యుల మద్దతుతో ఆమోదం పొందాలి. ఆశ్చర్యకరమైన పరిణామం ఏమిటంటే కాంగ్రెస్ పార్టీ కూడా ఈ తీర్మానానికి మద్దతు ఇవ్వబోతున్నట్టు వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 35 మంది కాంగ్రెస్ ఎంపీలు ఈ తీర్మానానికి సంతకం చేశారు. కిరణ్ రిజిజు మాట్లాడుతూ, " ఇది పార్టీలకు అతీత అంశం న్యాయవ్యవస్థలో అవినీతిపై ప్రతి పార్టీకి బాధ్యత ఉంది' అని అన్నారు.పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, మణిపూర్ హింస, ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు, బీహార్ ఓటర్ల జాబితా సమీక్ష వంటి అంశాలపై విపక్షం నిలదీయనుంది. మొత్తం 15 బిల్లులను ప్రభుత్వం ఈ సమావేశంలో ప్రవేశపెట్టనుంది. వీటిలో పన్నులు, నౌకాశ్రయం, క్రీడా పాలన, జియోహెరిటేజ్ పరిరక్షణ వంటి కీలక బిల్లులు ఉన్నాయి. కాంగ్రెస్ నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ "పహల్గామ్ ఘటనపై ప్రధాని స్వయంగా మాట్లాడాలి. విదేశాంగ విధానంపై కూడా ప్రధానమంత్రి స్పష్టత ఇవ్వాలి. మణిపూర్ ఇంకా ఎందుకు ఇంకా వెళ్లలేదనే ప్రశ్న కూడా మాకు ఉంది" అన్నారు. సుప్రియా సూలే (ఎన్సీపీ) 'రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, మంత్రులు అసెంబ్లీలో రమ్మీ ఆడుతున్నారు. అవినీతిపరులపై చర్యలు తీసుకోండి' అని విమర్శలు గుప్పించారు.

## తెలంగాణ రాజకీయాల్లో
# అంతర్గత కుమ్ములాటలు

తర్వాత పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు కల్వకుంట్ల కవిత రాసిన లేఖ విడుదల కావడం, ఆ తర్వాత పార్టీలో "దయ్యాలున్నాయని" వ్యాఖ్యలు చేయడం నుంచి తెలంగాణ జాగృతి జెండా, ఎజెండా వరకు గులాబీ పార్టీలో తీవ్ర ప్రకంపనలు రేపుతున్నాయి. ఏకంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైనే కవిత నేరుగా అసమ్మతి అస్త్రం సంధించడం విశేషం. ఇప్పటివరకు దీనిపై పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ గాని, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గాని ఎలాంటి చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది. ఇలాగే కవిత తన సొంత ఎజెండాతో పని చేసుకుంటూ పోతే చర్యలు తప్పవన్న చర్చ పార్టీలో సాగుతోంది. ఏది ఏమైనా ప్రతిపక్షంగా బలపడాల్సిన తరుణంలో ఎమ్మెల్సీ కవిత చేస్తోన్న వ్యాఖ్యలు, రాజకీయంగా వేస్తున్న అడుగులు ఆ పార్టీని ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పార్టీ ముఖ్యులు అంతర్గతంగా మదనపడుతున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణే తాను చేపడుతున్నట్లు కవిత చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఈ అసమ్మతి రాజకీయం ఏ తీరం చేరుతుందో వేచి చూడాల్సిందే. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రేసులో ఉండి, చివరిలో తప్పిపోయినప్పటి నుండి ఎంపీ ఈటల రాజేందర్ రాజకీయంగా కొంత మౌనంగా ఉన్నారు. అయితే ఇటీవలే కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన తర్వాత ఆయన చేసిన కామెంట్స్‌పై బీజేపీలో రచ్చ రచ్చే నడిచింది. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి "ఏటీఎంగా మారిందని" ప్రధాని మోదీ గతంలో వ్యాఖ్యలు చేశారు. అయితే కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన తర్వాత ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ, "కాళేశ్వరం ప్రాజెక్టు క్యాబినెట్ అనుమతితోనే నిర్మించారు, నేను ఆర్థిక మంత్రిగా నిధుల విషయంలో మాత్రమే జోక్యం చేసుకున్నాను" అని చెప్పారు."కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు మేలు చేసేదే, కానీ ఇందులో అవినీతి జరిగింది" అని కూడా చెప్పారు. అయితే ఇది ప్రధాని మోదీ వ్యాఖ్యలకు భిన్నంగా ఉందన్నది బీజేపీలోని కొందరి వాదన. దీనిపై వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ "తాము మాట మార్చేందుకు ఊసరవెల్లులం కాదని, ప్రధాని మోదీ అభిప్రాయమే పార్టీ అభిప్రాయమని" కుండబద్దలు కొట్టారు. ఇలా ఈ అంశం ఇరువురి మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. అధ్యక్ష పదవిని ఆశించినా హైకమాండ్ నుండి అతనికి గ్రీన్ సిగ్నల్ దక్కలేదు. ఆ పదవిని రాంచందర్ రావు ఎగురేసుకుపోయారు. అప్పటి నుండి ఈటలకు ప్రాధాన్యత ఉందన్న వాదన బీజేపీలో ఉంది. ఈ క్రమంలోనే ఈటల పార్టీలోని అసంతృప్తి నేతలతో మంతనాలు జరుపుతున్నారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఇలా ఉంటే, అధికార పార్టీ కాంగ్రెస్ కూడా ఇందుకు మినహాయింపు కాదని ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తేల్చి చెబుతున్నాయి. "పదేళ్లు నేనే సీఎం ఉంటా" అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. సీఎం పదవిని పార్టీలో "ఎవరూ శాశ్వతంగా రాయించుకోలేరని", పార్టీలో "అందరి సమిష్టి నిర్ణయమని" సీఎం రేవంత్ రెడ్డిపై కౌంటర్ అటాక్ చేశారు. ఇది "పార్టీ విధానాలకు వ్యతిరేకం" అన్నారు. పార్టీని "సామ్రాజ్యంలా భావిస్తే, పార్టీ నేతలు, కార్యకర్తలు సహించరని" చెప్పారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు "ప్రజాస్వామ్య పద్ధతిలో సీఎం ఎన్నిక ఉంటుందని" చెప్పారు. అంతే కాకుండా సీఎం పదవికి "తాను రేసులో ఉన్నానని", మంత్రి పదవి కూడా దక్కకపోవడం పట్ల "తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు" రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు నేరుగా సీఎంను ఉద్దేశించినవే కావడంతో కాంగ్రెస్ లోనూ అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉందని అర్థమవుతోంది. బీఆర్ఎస్, బీజేపీలో ఉన్నట్లే కాంగ్రెస్ లోనూ అసమ్మతి వర్గం తయారవుతోందని తెలుస్తోంది. అయితే రానున్న రోజుల్లో ఈ మూడు పార్టీలు అసమ్మతి రాగాలను ఆపేలా ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ సోమవారం 21, జులై 2025



# బోనం ఎత్తిన కలెక్టర్ దంపతులు

- ప్రత్యేక రాష్ట్రంలోనే బోనాలను రాష్ట్ర పండుగగా గుర్తింపు
- భక్తి, సాంప్రదాయం, వినోదంతో కూడుకున్న ఒక గొప్ప పండుగ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ జూలై 20 (ప్రజా స్వరం)** గ్రామీణ వాతావరణంలో నివసించే కుటుంబాల్లో బంధాలను, అను బంధాలను పెంపొందించే వారిధి బోనాలు పండుగ అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం నల్ల పోచమ్మ అమ్మ వారికి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కుటుంబ సమేతంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ పట్టణం తారక రామ నగర్ కాలనీ లోని నల్ల పోచమ్మ ఆలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అయన సతీమణి శ్రీజ అమ్మ వారికి బోనం తీసుకు వచ్చి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల విశిష్టతను గురించి కలెక్టర్ మాట్లాడుతూ బోనాల పండుగ, భక్తి, సాంప్రదాయం, వినోదంతో కూడుకున్న ఒక గొప్ప పండుగ అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. ఈ పండుగలో, స్త్రీలు అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పిస్తారని అన్నారు. పండుగను ఆషాడ మాసంలో జరుపుకుంటారు, ఇది సాధారణంగా జూలై లేదా ఆగస్టు నెలలో వస్తుందని, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే బోనం, పాలు, బెల్లం, నూనె ఇతర పదార్థాలతో తయారు చేస్తారని తెలిపారు.

నగరంలో ఆషాడమాసంలో జరిగే బోనాలు గ్రామాల్లో శ్రావణ మాసంలో జరుగుతాయని, గ్రామాల్లో కులవృత్తుల సంప్రదాయం ప్రకారం బోనాల వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తారని, పండుగ మొదటి, చివరి రోజులలో ఎల్లమ్మదేవికి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు.

# వసతి గృహ సంక్షేమ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఉన్నతమైన విద్యా ప్రమాణాలే లక్ష్యం...
- కుల్చారం బీసీ సంక్షేమ శాఖ వసతి గృహ నిర్వహణ తీరు ఇతర వసతి గృహాలకు ఆదర్శం
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ జూలై 20 (ప్రజా స్వరం)** వసతి గృహ సంక్షేమ అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యార్థుల ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.ఆదివారం కుల్చారం మండలం బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, స్టోర్ రూమ్, మెనూ, వసతి గృహంలో మరుగుదొడ్ల పరిశీలించారు. వసతి గృహ నిర్వాహన తీరు ను పర్యవేక్షించిన అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహాలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని, కొత్తగా చేరిన విద్యార్థులతో ఐకమత్యంగా మెలుగుతూ వారిని వసతి గృహనికి అలవాటయ్యే వరకు అధికారులు పర్యవేక్షించాలని, కొత్తగా చేరిన విద్యార్థుల పై దృష్టి పెట్టి విద్యార్థులతో కలిసి పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య తో పాటు క్రీడలపై ఆసక్తిని కల్పిస్తూ కొత్తగా చేరిన విద్యార్థుల పట్ల దృష్టి పెట్టాలన్నారు.ఆరోగ్యంతో పాటు పరిశుభ్రత నిర్వహణ నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటూ వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతినెల వైద్య శిబిరం ఏర్పాటు చేయించాలన్నారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని అదేవిధంగా శానిటేషన్ చేపట్టి చెత్తను తొలగిస్తూ అహల్లాద కరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయా లన్నారు. కొత్త మెనూ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులతో సమీక్షించాలన్నారు. కలెక్టర్ వెంట బీసీ వసతి గృహ వార్డెన్ ఉమ, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏక దశ రుద్రాభిషేకం



**మెదక్ జూలై 20 (ప్రజా స్వరం)** సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా మెదక్ వాసవి నగర్ లో సత్యసాయిబాబా మందిరంలో ఏకదశ రుద్రాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అభిషేకం జరగా, భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం భక్తులు శివలింగానికి అభిషేకం చేసి, స్వామివారిని దర్శించుకుని పరవశించిపోయారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఘనంగా ఆషాడ మాస వనభోజనాలు



**రామాయంపేట. 20.( ప్రజా సర్వం )** మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఘన్సీలింగాపూర్ లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాసం వన భోజనాలు జరుపుకున్నారు. సంఘం ఏర్పడిన తర్వాత మొదటి సారి రెడ్డి కుటుంబ సభ్యులందరూ పిల్లాపాపలతో ఆనందోత్సవాల మధ్య వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నామని రెడ్డి సంఘం అధ్యక్షుడు లచ్చవ్వల నర్సారెడ్డి అన్నారు. ప్రతి ఏటా మరింత ఘనంగా వన భోజనాలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని రెడ్డి సంఘానికి చెందిన కుటుంబ సభ్యులతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న మా గ్రామ రెడ్డి బంధువులందరూ పాల్గొన్నారన్నారు. ఈ వన భోజనాల ఏర్పాటుతో పరిచయాలు మరింత బలపడి రెడ్డి సంఘం బలోపేతానికి కృషి చేసినట్లు అవుతుందన్నారు. రెడ్డి సంఘం సభ్యులు జగంరెడ్డి, గరుగుల శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బి. నర్సారెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాంచంద్రారెడ్డి, అంజిరెడ్డి, బాపురెడ్డి, రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో బోనాల ఉత్సవాలకు
# హాజరైన ఏనుగు సుదర్శన్ రెడ్డి



**మేడ్చల్ ( ప్రజాస్వరం ) :** మేడ్చల్ పట్టణంలోని రాములోరి మైసమ్మ ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, నాయకులు గోపు నాగరాజు, బండి విష్ణు గౌడ్, వంశీధర్ రెడ్డి, బాబు రాజ్, విజయ్ ఆలయ కమిటీ నిర్వాహకులు గాంధీ యాదవ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మూడుచింతలపల్లి
# మాజీ సర్పంచ్ జాం.రవి జన్మదిన వేడుకలు

- వికలాంగుల మధ్య జన్మదిన వేడుకలు.
- ప్రెస్ క్లబ్ కు కూల్ వాటర్ డిస్పెన్సర్ ప్రదానం..



**శామీర్ పేట / జులై 20 (ప్రజా స్వరం ) :** అన్ని దానలకంటే అన్నదానం గొప్పది అని మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాం రవి అన్నారు. మూడుచింతలపల్లి మండలనికి చెందిన మాజీ సర్పంచ్ జాం రవి జన్మదినం సందర్భంగా జగంగూడ గ్రామ పరిధిలో ది హోమ్ ఫర్ డిజేబుల్ అనాథ ఆశ్రమంలో ఆదివారం కేక్ కట్ చేసి వికలాంగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం వికలాంగులతో జన్మదిన సందర్భంగా వారితో కలిసి భోజనంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ........ డబ్బులు వృధా చేయకుండా ఇలాంటి పేద, అనాథ ఆశ్రమంలో అన్నదానం చేస్తే పుణ్యఫలం ఉంటుందని అన్నారు. అలాగే ఉమ్మడి శామీర్ పేట నూతన ప్రెస్ క్లబ్ కు జన్మదిన సందర్భంగా తనకు తోచినంత సహాయం కూల్ వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నాగరాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు క్యాతం.రవి, ఉపాధ్యక్షుడు సింగం పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్ యాదవ్, ప్రెస్ క్లబ్ సభ్యులు,మాజీ వార్డు మెంబర్ ర్యాకాల రాజేంద్రప్రసాద్ గౌడ్, తుమ్ వేణుగోపాల్, యాదగిరి, వివిధ పార్టీ నాయకులు మురళి గౌడ్, శ్రావణ్ కుమార్ గుప్తా, నెల్లుట్ల యాదగిరి, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న
# మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



**రామాయంపేట. 20.( ప్రజా సర్వం)** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని మహంకాళి అమ్మవారిని మండలంలోని కోనాపూర్ గ్రామంలో దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మాదేవేందర్ రెడ్డి. కోనాపూర్ లో మహిళలతో కలిసి బోనం ఎత్తుకొని దుర్గమ్మ అమ్మవారికి సమర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ఎంతో గొప్పది అన్నారు. ఎన్నడు లేనివిధంగా తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని బోనాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడు అని తెలిపారు. అమ్మవారి దీవెనలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో దేవాలయాలకు పుష్కలంగా నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడపాలని సూచించారు. అనంతరం ఆలయ అర్చకులు పద్మ దేవేందర్ రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బాధ చంద్రం,నాయకులు ఎస్ కే అహ్మద్, అశ్నుద్దీన్, ఐలయ్య, రామ్ కి, ఉమామహేశ్వర్, రాజు యాదవ్, చింతల రాములు, మర్కు దత్తు, సుభాష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాత నల్ల పోచమ్మ బోనాలు



**మెదక్ జూలై 20 (ప్రజా స్వరం)** ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో శ్రీ మాత నల్ల పోచమ్మ బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల కార్యక్రమం ఫతేనగర్ లో గల పద్మశాలి సంఘం నుండి డప్పు చప్పుళ్ళు, పొతరాజుల విన్యాసాలు యువకుల నృత్యాల మధ్య అంగ రంగ వైభవంగా బోనాలను పుర విధుల గుండ ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షుడు చిన్న రామచంద్రం, కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి బొద్దుల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు మ్యాకల జయరాములు, సంఘం బాధ్యులు నర్సింలు, రమేష్, సుధాకర్, పెంటయ్య, లక్ష్మీ నారాయణ, కృష్ణ మూర్తి, నర్సింలు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
హైదరాబాద్ సోమవారం 21, జులై 2025

# మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్

# అంగరంగ వైభవంగా
# కాళికా మాతా బోనాల మహోత్సవం

**ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, యువకులు నృత్యాలు..**




**మెదక్ జూలై 20 (ప్రజా స్వరం)** స్వర్ణకారుల ఆరాధ్య దైవం శ్రీమాత కాళికామాతకు మెదక్ పట్టణ స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసం పుర స్కరించుకొని స్వర్ణ కార సంఘం స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పూనా రవి చారి, పట్టణ అధ్యక్షులు ఏలే శ్వరం బ్రాహ్మ చారి ల ఆద్వర్యంలో బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవాలలో పోతరాజుల విన్యాసాలు యువకులు నృత్యాల తో బోనాలు ముందు కు సాగి పెద్దబజార్ , రాందాస్ చౌరస్తా, కొలిగడ్డ మీదుగా ఊరేగిస్తూ కాళికాదేవి ఆలయంలోబోనాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ ఉత్సవంలో అర్చకులు బద్ధోజు శివరామ చారి, స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల వేణు, కోశాధికారి సరాపు కాశీనాథం, ఆలయ కమిటీ అధ్యక్షులు బ్రాహ్మ చారి, చెన్నోజీ మహేష్, నల్లనాగుల రాజు, యువత అధ్యక్షులు మత్తోజు రవి తదితరులు పాల్గొన్నారు.





## పలహారం బండి ఊరేగింపు ప్రారంభించిన బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్.కంతా రెడ్డి తిరుపతిరెడ్డి



**రామాయంపేట. 20.( ప్రజా సర్వం)** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో ఆషాడం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆషాడ మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని గ్రామంలోని వివిధ అమ్మవారి ఆలయాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. శ్రీ మహంకాళి మాత దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంతా రెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. శ్రీ మహంకాళి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తొమ్మిదవ వార్డులోని దుర్గమ్మ ఆలయాన్ని ఆయన సందర్శించి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి కార్యకర్తలతో కలిసి నృత్యాలు చేశారు. అనంతరం ఎనిమిదో వార్డులోని కోటమ్మ దేవాలయంలో నిర్వహించిన ఆషాడం ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కోటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని,పాడి పంటలు బాగా పండాలని, గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అందే కొండల్ రెడ్డి, బసన్నపల్లి రాజు యాదవ్, భానుచందర్, సల్మాన్, చింతల రాములు, కన్నపురం కృష్ణ గౌడ్, నవాత్ మహేష్, శ్రీశైలంరెడ్డి, శ్యాంమ్ రెడ్డి, విద్యాకర్ రాజు, తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ అధికారంలో ఉంటే కష్టాలు, నష్టాలు

**– మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**

మక్తల్ : కాంగ్రెస్ అంటే కర్మ కాలిన పార్టీ అని , ఆ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్ర ప్రజలకు కష్టాలు , నష్టాలు ఉంటాయని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నర్వా మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ నిర్వాహకానికి హైకోర్టు మెట్టికాయలు వేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల కోసం హడావుడి చేస్తున్నాడని, రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని మరొక్కసారి పన్నాగం పన్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తీసుకువెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పల్లె తీర్పు నుంచే కాంగ్రెస్ పతనం ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వచ్చిన అనుమతుల ప్రకారంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి తమ ప్రభుత్వంలో వచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటూ తిరుగుతున్నారని ఆరోపించారు. మక్తల్ నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో చిట్టెం సుచరిత రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సింగల్ విండో వైస్ చైర్మన్ లక్ష్మణ్, మరికల్ మాజీ ఎంపీపీ శశికళ రాజవర్ధన్ రెడ్డి, నాయకులు దండు అయ్యప్ప, విజయ్, జనార్ధన్, అశోక్, శంకర్, శేఖర్ యాదవ్, రాజారెడ్డి, నరసింహ, మాధవరెడ్డి లతోపాటు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

**– కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్**

జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని నలబండ బోడు గ్రామంలో జూలూరుపాడు ప్రెస్ క్లబ్ సీనియర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ.. మారుమూల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉంటున్న అడవి బిడ్డల ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనపరిచి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రెస్ క్లబ్ సభ్యులను అభినందించారు. నిరుపేదలకు ఆరోగ్య సేవలు అందించడం గొప్ప విషయం అన్నారు. జూలూరుపాడు మండలంలోని మారుమూల గ్రామమైన నల్ల బండ బోడు గ్రామం గత పది సంవత్సరాల నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఎటువంటి కేసులు లేకుండా ఉత్తమమైన గ్రామంగా ఉందని గ్రామ ప్రజలను అభినందించారు. గ్రామంలో ప్రతి తల్లిదండ్రులు పిల్లలను మంచిగా చదివించాలని కొంత మేరకు చదువులు చదివించిన ఆ చదువుకు తగ్గ ఉద్యోగాలు మేరకు దగ్గరలో ఉన్న పట్టణాలకు పంపించడం ద్వారా గ్రామంలో ఉన్నటువంటి మిగతా వారంతా చదువుకోవాలని ఆసక్తి పెరుగుతుందన్నారు. అడవి ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామం కనుక విషపురుగుల నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాకాలం మొదలైనందున వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు ఇచ్చారు.

# కర్ర సాయంతో చెప్పు తీసుకోబోయి..
# నదిలో కొట్టుకుపోయిన యువకుడు..!

నదీ పరివాహక ప్రాంతాలు, పర్యాటక స్థలాల్లో జాగ్రత్తలు తీసుకోవడంతో కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా మధ్యప్రదేశ్ లో ఓ యువకుడు నదిలో కొట్టుకుపోయాడు. స్నేహితులతో కలిసి సరదాగా విహారయాత్రకు వెళ్లిన అతడు అందరూ చూస్తుండగానే గల్లంతయ్యాడు. నదిలో పడిన చెప్పును తీసుకోబోయి తమ కళ్ల ముందే స్నేహితుడు నది ప్రవాహంలో కొట్టుకుపోవడం చూసి మిగతా నలుగురు కన్నీరుమున్నీరుగా విలపించారు. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో ఉన్న పరేవా కోహ్ స్థానికంగా చాలా ఫేమస్ పర్యాటక స్థలం. కొండలు, నది నీళ్లతో ఆహ్లాదకరంగా ఉంటుందీ ప్రదేశం. ఆదివారం సెలవురోజు కావడంతో ఆయుశ్ తన ఐదుగురు స్నేహితులతో కలిసి 'పరేవా కోహ్' కు వెళ్లాడు. అక్కడి ప్రకృతిని ఆస్వాదిస్తున్న క్రమంలో అతడి చెప్పు అనుకోకుండా పక్కనే ప్రవహిస్తున్న నదిలో పడిపోయింది. నీళ్లలో తేలుతున్న ఆ చెప్పును అతడు ఒక కర్ర సాయంతో బయటకు తీసేందుకు ప్రయత్నించాడు. ప్రవాహ ధాటికి చెప్పు కొంచెం ముందుకు వెళ్లగా.. ఆయుష్ కూడా రాళ్ల మీదుగా అక్కడికి చేరుకున్నాడు. స్నేహితులు వారిస్తున్న వినకుండా అతడు నీళ్లకు దగ్గరగా వెళ్లాడు.అయితే.. అతికష్టమ్మీద చెప్పును కర్రతో అందుకుంటుండగా.. ఆయుశ్ పట్టుతప్పిపోయి నీళ్లలో పడిపోయాడు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అతడు రాళ్లను పట్టుకుని బయటకు వద్దామనుకున్నా కుదరలేదు. నదిలో అతడలా కొట్టుకుపోతుంటే ఏం చేయాలో తెలియక భోరున ఏడ్చారు స్నేహితులు. వెంటనే అక్కడి సిబ్బందికి ఈ విషయం తెలియజేయగా.. పోలీసులు పరుగున వచ్చి ఆయుష్ కోసం గాలిస్తున్నారు. '20 ఏళ్ల ఆయుష్ తన ఐదుగురు స్నేహితులతో కలిసి పరేవా కోహ్‌లోని పిక్నిక్ ప్రదేశానికి వెళ్లాడు. దురదృష్టవశాత్తూ నీళ్లలో పడిన కాలి చెప్పును కర్రతో బయటకు తీసే క్రమంలో అతడు నదిలో కొట్టుకుపోయాడు. ఈతగాళ్లను



రంగంలోకి దింపి అతడి కోసం గాలిస్తున్నాం' అని పోలీస్ అధికారి పూజా చౌస్కీ మీడియాకు తెలిపాడు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి : ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



బిజినేపల్లి : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మండలంలోని వట్టెం గ్రామం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పరిసరాల్లో హరిత హారంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనం పెంచడం వల్ల సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, తద్వారా పంటలు బాగా పండుతాయని పేర్కొన్నారు. మొక్కలు నాటి రక్షణ కంచలు ఏర్పాటు చేయాలని సూచించారు.కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్ రెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ అనంత నరసింహా రెడ్డి, నిత్యాన్న సత్రం కమిటీ అధ్యక్షులు వాస ఈశ్వరయ్య, సందడి రామచంద్రా రెడ్డి, సురేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సుబ్బా రెడ్డి, చంద్రా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, హకీమ్ మురళి, బండారు రాజశేఖర్, బాదం కృష్ణయ్య, శ్రీరామ్ రెడ్డి, భాస్కరాచారి, తిరుపతయ్య, ఈశ్వర్, రాములు, శీను, నసీర్, ఎంపీడీవో కథలప్ప, నవోదయ పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే: ఆర్. కృష్ణయ్య



ముషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు, కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో భవిష్యత్తు కార్యాచరణ చర్చించడానికి ఆగస్టు 3న రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా, మండల, రాష్ట్రస్థాయి ముఖ్య నాయకులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అమలుకు తీసుకోవలసిన కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు.హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన, చట్టపరమైన, రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల జీవో తీయకుండా కోర్టు కొట్టి వేస్తుందని ఊహాగానాలతో పెండింగ్‌లో పెట్టారని స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చని ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తాయని భావించినా.. సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లినాసరే బీసీలే కేసులు గెలిచే అవకాశం ఉందని స్పష్టం చేశారు. బీసీలందరూ ఈ రిజర్వేషన్లు కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు.

## భార్యను కొట్టడంతో ఆసుపత్రిపాలు.. అక్కడికెళ్లి కత్తితో పొడిచి చంపిన భర్త



చెన్నై: కుటుంబ గొడవల వల్ల ఒక వ్యక్తి తన భార్యను కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఆసుపత్రిలో చేరింది. అక్కడకు వెళ్లిన భర్త తన భార్యను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆ తర్వాత హాస్పిటల్ నుంచి పారిపోయాడు. తమిళనాడులోని కరూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కులితలైకు చెందిన విశ్రుత్, అతడి భార్య శ్రుతి మధ్య శనివారం రాత్రి వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో జరిగిన గొడవలో భార్య గాయపడింది. అస్వస్థతకు గురైన శ్రుతిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఆదివారం ఉదయం విశ్రుత్ తన భార్య శ్రుతిని చూసేందుకు ఆ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నాడు. అయితే రహస్యంగా దాచి వెంట తెచ్చిన కత్తితో ఆమెను పొడిచి చంపాడు. అక్కడున్న మిగతా రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఇది చూసి షాక్ అయ్యారు. విశ్రుత్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని అక్కడి నుంచి పారిపోయాడు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. శ్రుతి హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారైన ఆమె భర్త విశ్రుత్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999